సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 27 । జనవరి । 2023


పోలీసులు, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


పాడేరులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గిరి సంక్షేమమే లక్ష్యం

- అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- కొత్త జిల్లా ఆవిర్భావంతో పాలన మరింత చేరువ
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఘనంగా గణతంత్ర వేడుకలు

సాక్షి,పాడేరు: ఎందరో మేధావులు, స్వాతంత్ర్య సమరయోధులు కఠోర శ్రమతో భారత రాజ్యాంగాన్ని అందించారని, వారి మహోన్నత ఆశయాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఆవిర్భవించిన తరువాత జిల్లా కేంద్రమైన పాడేరులో తొలిసారిగా 74వ గణతంత్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో ముందుగా జాతీయ జెండాను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు.అనంతరం కలెక్టర్‌తో పాటు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్,ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా గిరిజనుల సంక్షేమం, పరిపాలన దగ్గర చేసే లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బడుగు,బలహీనవర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రమైన పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నామని, రానున్న రోజుల్లో జిల్లాలోని ప్రజలకు ఉన్నత వైద్యసేవలు మరిన్ని అందుబాటులోకి వస్తాయన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద 1,25,465 మందికి ప్రతి నెలా రూ.34 కోట్ల మేర పింఛన్ సొమ్మును ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. జిల్లాలోని 352 గ్రామసచివాలయాల పరిధిలో గిరిజనుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు పనిచేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్నారని, ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటికే రూ.19కోట్ల పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు పలు నెట్‌వర్క్‌ల పరిధిలో 205 సెల్ టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఇప్పటికే 25 పూర్తయ్యాయని వివరించారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాలను ఎస్పీ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 947 పాఠశాలలు,127అంగన్‌వాడీ కేంద్రాలు,12జూనియర్ కళాశాలల్లో రెండవ విడత నాడు–నేడు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.జిల్లాలో రూ.244.80కోట్లతో జిల్లాలో 1,118మంది పీఎం ఆవాస్ యోజన–వైఎస్సార్ గ్రామీణ యోజనలో ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. జల్‌జీవన్‌మిషన్ ద్వారా 2024 నాటికి ప్రతీ ఇంటికి సురక్షిత తాగు నీటి కుళాయిల ద్వారా పంపిణీ చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. రూ.630 కోట్లతో చేపట్టిన 1250 తాగునీటి ప్రాజెక్టుల పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లా అభివృద్ధికి సహకారం అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఐటీ పరిశ్రమలుశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు,అరకులోయ,రంపచోడవరం ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ధనలక్ష్మి, తోటి అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

అంబేద్కర్, అల్లూరి విగ్రహాల ఆవిష్కరణ


అంబేద్కర్, అల్లూరి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సర్పంచ్ వంతాల సీతమ్మ ఆవిష్కరించారు. పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వంజంగి కొండపై రెపరెప



సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతం వంజంగి కొండపై గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని స్థానిక గిరిజనులు, పర్యాటకులు గురువారం ఉదయం జాతీయ జెండాను ఎగురవేశారు. దేశభక్తిని చాటుకున్నారు.

ఆదివాసీలకు అండగా..

- ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంభా రవిబాబు


గిడుగులు ధరించిన విదేశీయులతో రవిబాబు

దుంబ్రిగుడ: ఆదివాసులకు దళారీల ద్వారా ఎటువంటి అన్యాయం జరిగినా రాష్ట్ర ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన గణతంత్రవేడుకల్లో ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. గిరి విద్యార్థులు థింసా నృత్యాన్ని ప్రదర్శించారు. వారితో కలిసి విదేశీ శాస్త్రవేత్తలు నృత్యం చేస్తూ సందడి చేశారు. మూడున్నర ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 4.26 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సంపూర్ణ అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు లిల్లీ, రామలక్ష్మి, ఎంఈవో త్రినాథరావు, హెచ్‌ఎంలు బాలాజీ,సునీత,సుజాత, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ఎంపీడీవో నగేష్, తహసీల్దార్ ముజీబ్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం


ఐటీడీఏలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న పీవో సూరజ్‌గనోరే, ఎమ్మెల్యే ధనలక్ష్మి


చిన్నారులతో ఎమ్మెల్యే ధనలక్ష్మి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిస్తుందని రంపచోడవరం పీవో సూరజ్ గనోరే అన్నారు. గురువారం స్థానిక స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఐటీడీఏ పీవో జాతీయ జెండాను ఎగురవేశారు. ఎందరో మహానుభావులు త్యాగ ఫలితమే మన దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్రం రావడానికి కారణమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవాలన్నారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం సంపూర్ణంగా అమల్లోకి వచ్చిన రోజు అన్నారు. దీని ద్వారా గిరిజన ప్రాంతంలో రిజర్వేషన్ ద్వారా ప్రత్యేకమైన హక్కులు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి ఆటల పోటీల్లో రంపచోడవరం నియోజకవర్గం వివిధ పోటీల్లో విజయానికి కృషి చేసిన కబడ్డీ జట్టు కెప్టెన్ (బాలరు, విన్నర్) కె.ముక్తేష్, వాలీబాల్ జట్టు కెప్టెన్ ఎస్. వేణు (బాలురు, రన్నర్, మహిళల కబడ్డీ టీం కెప్టెన్ ఎన్. గీత (రన్నర్)కు సరిఫికెట్లు, షీల్డులు అందజేశారు. వీరితోపాటు జాతీయ స్థాయిలో ఢిల్లీలో నిర్వహించిన రోప్ స్కిప్పింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన బందపల్లి ఆశ్రమ విద్యార్థి కె. కల్విన్ బాబు, రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్‌లో భీమవరంలో నిర్వహించిన మీట్‌లో ద్వితీయ స్థానం సాధించిన బందపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి కె.లోకేష్‌తో పాటు మొత్తం 38 మందికి అందజేశారు. ఎంపీపీ శ్రీమతి బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ శ్రీమతి పండా వెంకటలక్ష్మి, ఏపీవో శ్రీనివాసరావు, ఏవో డీఎస్‌వీ రమణ, డీఎం.జి.పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.


రంపచోడవరం డైట్ విద్యార్థుల ప్రదర్శన

ప్రభుత్వ కార్యాలయాల వద్ద..

రంపచోడవరం ఏఎస్పీ కార్యాలయం వద్ద ఏఎస్పీ అ. ధీరాజ్‌సింగ్‌రాణా, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్‌కలెక్టర్ శుభం బన్సల్, జీసీసీ డీఎం కార్యాలయం వద్ద డీఎం పార్వతీశ్వరరావు, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మంగా బొజ్జయ్య జాతీయ జెండాను ఎగురవేశారు.


బొండంగూడలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

రాజ్యాంగ విలువలు తెలుసుకోవాలి


చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

చింతూరు: ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలు తెలుసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే కోరారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పౌరులకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించిందని, వాటిని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఏపీవో కంచర్ల సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పాల్గొన్నారు.


కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతులమీదుగా ఉత్తమ సేవా పత్రాలు అందుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, పాడేరు ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, అరకు తహసీల్దార్ వేణుగోపాల్, పాడేరు తహసీల్దార్ త్రినాథనాయుడు, హుకుంపేట తహసీల్దార్ రాజ్యలక్ష్మి, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, పాడేరు ఎంపీడీవో నవీన్, అరకు సీఐ జి.దేముడుబాబు..


ఉత్తమ సేవలకు పురస్కారాలు

సాక్షి,పాడేరు: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 252 మంది పలు శాఖల అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ పురస్కారాలు అందజేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.


డీసీఆర్‌బీ సీఐ జి.అప్పన్న, గిరిజన సంక్షేమశాఖ డీఈఈ అనుదీప్, పాడేరు ఆర్‌అండ్‌బీ డీఈఈ ఎస్.వెంకటరావు, పాడేరు సబ్‌ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, అనంతగిరి ఏటీడబ్ల్యూవో వెంకటరమణ రుణ రికవరీ అధికారి ఎన్.సీతారామ్, కలెక్టర్ సీసీ శ్రీధర్, పాడేరు ఐటీడీఏ పీవో సీసీ పవన్‌కుమార్ ..


ముంచంగిపుట్టు పశువైద్యాధికారి భాస్కర్‌రావు, జినబాడు పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, జేఈ భగవంతరావు,ఉద్యానశాఖ కాఫీ విభాగం అధికారి లక్ష్మి, కొయ్యూరు ఏపీజీవీబీ బీఎం సతీష్‌కుమార్, వార్డెన్ హరిదేవ్, రంపచోడవరం కానిస్టేబుల్ వరహాలు, గంగవరం ఏవో విశ్వనాథ్, రాజవొమ్మంగి వైద్యాధికారి డాక్టర్ శ్రీదుర్గ, వై.రామవరం ఎస్ఐ సంతోష్‌కుమార్, అడ్డతీగల ఎంపీడీవో వివేక్, కానిస్టేబుల్ సూర్యతేజ

విదేశీయుల సందడి


ఒనకఢిల్లీ వారపు సంతలో విదేశీయులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీలో గురువారం జరిగిన వారపు సంతలో విదేశీయులు సందడి చేశారు. వారపు సంతకు వచ్చిన అంద్రహల్,ఒనమనాల్ గ్రామాల బొండా జాతి గిరిజనులతో ఫొటోలు తీసుకున్నారు. వారి ఆచార, సంప్రదాయాలను తెలుసుకున్నారు. వారు సంతకు తీసుకువచ్చిన పూసలు, కాండియాలు తదితర వస్తువులను కొనుగోలు చేశారు. ఇక్కడికి వచ్చిన వారిలో ఫ్రెంచ్, లండన్, ఇటలీ, ఇజ్రాయిల్ దేశాలకు చెందినవారు ఉన్నారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం,వించ్ హౌస్,డుడుమ జలపాతాన్ని సందర్శించారు. వీరితో గిరిజనులు కూడా సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

చింతపల్లి @4.2 డిగ్రీలు



- మన్యంలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లిలో గురువారం 4.2 డిగ్రీలు, అరకులోయలో 7.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు తీవ్రత కాస్త తగ్గింది. సూర్యోదయం వేగంగానే అవుతున్నప్పటికీ చలిగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి చింతపల్లి ప్రాంతంలో ఐదు లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నెలకొంటున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు చలి తీవ్రతకు గజగజ వణుకుతున్నారు.అత్యంత శీతల ప్రాంతమైన లంబసింగిలో చలిపులి పర్యాటకులను భయపెడుతోంది. ప్రజలు సాయంత్రం నుంచే చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.


చింతూరులో శస్త్రచికిత్సలు ప్రారంభం

- విలీన మండలాల ప్రజలకు తప్పిన అవస్థలు

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం నుంచి శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి తెలిపారు. విలీన మండలాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కృషి ఫలితంగా వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ చింతూరు, కూనవరం ఆస్పత్రుల్లో వైద్య నిపుణులను నియమించినట్లు ఆయన తెలిపారు. చింతూరు ఏరియా ఆస్పత్రికి గైనకాలజిస్టు, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ నిపుణులతో పాటు కూనవరం ఆస్పత్రికి జనరల్ సర్జన్ వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. చింతూరుకు చెందిన షేక్ ఫర్హాన్ అనే గర్భిణికి గైనకాలజిస్టు డాక్టర్ శశికళాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో తొలి శస్త్రచికిత్స నిర్వహించారు. కూనవరం ఆసుపత్రిలో కూడా ఒకట్రెండు రోజుల్లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని సూపరింటెండెంట్ కోటిరెడ్డి తెలిపారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో కాన్పులతో పాటు ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ నిపుణుల సేవలను నాలుగు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, త్వరలోనే మరి కొంత మంది వైద్య నిపుణులు రానున్నారని ఆయన పేర్కొన్నారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు అందుబాటులోకి రావడంతో చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు శస్త్రచికిత్స నిమిత్తం భద్రాచలం, రంపచోడవరం ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవస్థలు తప్పాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చింతూరు ఏరియా ఆస్పత్రిలో గర్భిణికి శస్త్రచికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

కూతుర్ని రక్షించి.. తండ్రి మృతి



అన్యోన్యమైన దంపతులు.. ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. చింతల్లేని కుటుంబం. దేశ సేవలో తన కర్తవ్యాన్ని ఆనందంగా నిర్వర్తించి, గతేడాదే ఆయన పదవీ విరమణ పొందారు. నడి సంద్రంలోనైనా ఈదుకుంటూ బయటికి రాగల సామర్థ్యముంది. అయినా.. ఆ రాకాసి జలపాతం ముందు ఓడిపోయాడు. తన గారాల కూతుర్ని రక్షించి, తను మాత్రం అనంతలోకాలకు చేరుకున్నాడు. గణతంత్ర దినోత్సవాన కొయ్యూరులోని గాదెగుమ్మి జలపాతంలో ప్రమాదవశాత్తూ విశాఖజిల్లా వేపగుంట దరి పురుషోత్తపురానికి చెందిన విశ్రాంత నావికా దళ ఉద్యోగి మంతెన సుబ్బరాజు మరణించారు. దీంతో అతని కుటుంబం, మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

8లో

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం యొక్క రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.అప్పలస్వామి ఆదేశించారు. కొత్తపల్లి జలపాతాన్ని ఏకో టూరిజంగా మార్పు చేసిన విషయం తెలిసిందే. కొత్తపల్లి గ్రామంలోని జలపాతం నిర్వహణ రికార్డులను ఆయన గురువారం తనిఖీ చేశారు. జలపాతాన్ని సందర్శనకు వచ్చే పర్యాటకుల నుంచి వసూలు చేసే రుసుం, పార్కింగ్ తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. రికార్డులు అప్‌డేట్‌గా ఉండేలా చూడాలని ఏకో టూరిజం సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఏకో టూరిజం సూపర్‌వైజర్ వి.అభి, రాజు తదితరులున్నారు.



ధింసా నృత్యం చేస్తున్న గిరి విద్యార్థులు



అనంతగిరి: భారతదేశ చిత్రపటం నమూనాలో విద్యార్థుల ప్రదర్శన



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాడేరు కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాక్షి,పాడేరు: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని తలారిసింగి మైదానంలో పలు విద్యాలయాల విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్యం అందించే 108 వాహనాలు, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రదర్శించిన రూపకం మొదటిస్థానంలో నిలిచింది. పాడేరు కేజీబీవీ విద్యార్థినుల నృత్యం ద్వితీయస్థానం, తలారిసింగి బాలికల ఇంగ్లీషు మీడియం బాలికలు దేశ భక్తి నృత్యరూపకం తృతీయ బహుమతి పొందింది. పలు విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు ధింసా నృత్యాలతో సందడి చేశారు. వీరిని కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ అభినందించారు. మెరిట్‌పత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాళ్లు, శకటాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, జీసీసీ, ఐసీడీఎస్, ఐటీడీఏ కాఫీ విభాగాల్లో పథకాలపై వీటిని ఏర్పాటు చేశారు. స్టాల్‌లో కాఫీ, ఐసీడీఎస్ ప్రదర్శించిన పౌష్టికాహారాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు రుచి చూశారు.

అనంతగిరి:మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలలోని హెచ్‌ఎం మల్లీశ్వరీ ఆధ్వర్యంలోని గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు భారతదేశ పటం ఆకారంలోని ప్రదర్శనిచ్చారు. ఈ కార్యక్రమం పాఠశాలలోని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆకట్టుకున్న గిరి విద్యార్థుల విన్యాసం



కాఫీ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



కేజీబీవీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



ప్రథమ బహుమతి పొందిన తలారిసింగి విద్యార్థుల ప్రదర్శన



వ్యవసాయశాఖ శకటం

1/70 చట్ట పరిరక్షణకు వినతి

అరకులోయ రూరల్: 1/70 చట్ట పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గిరిజన ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును కోరారు. గురువారం అరకులోయలో పర్యటించిన ఆయనకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్‌లో ఆదివాసీ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషిచేయాలని విన్నవించారు. సంఘ ప్రతినిధులు నంద, సాంబ శివరావు, జలంధర్, పెద్దన్న, హుకుంపేట జడ్పీటీసీ రేగం మత్స్యలింగం పాల్గొన్నారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ఉద్యోగ సంఘ ప్రతినిధులు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ అంత్రిగుడ గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుతో కలిసి అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు పర్యటించారు. వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనాలు నిర్మించడమే కాకుండా వీధి లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామ గిరిజనులు కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఎస్టీ కమిషన్ సభ్యులు లిలీ, రామలక్ష్మి పాల్గొన్నారు.

క్షయ రోగులకు మెరుగైన వైద్యం




పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

జి.మాడుగుల: క్షయ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి(డీటీసీవో) డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిధిలో ఉన్న టీబీ కేసులు, వాటి పరిస్థితులపై వైద్యాధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్‌ల నుంచి తెలుసుకున్నారు. టీబీ కేసు వివరాల రిజిస్టర్లు, మందుల సరఫరా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలు కనిపిస్తే తక్షణమే పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. టీబి రోగులు ఆరోగ్య పరిస్థితులను గమనించి మెరుగైన వైద్యం, మందులు అందజేయాలని ఆదేశించారు. ఎంపీహెచ్‌ఈవో ఎస్ ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూతుర్ని రక్షించి.. తండ్రి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ, స్థానికులు



మరణానికి కొద్ది క్షణాల ముందు స్నేహితుడు శ్రీకాంత్‌తో సుబ్బరాజు(ఎడమవైపు వ్యక్తి)

- గాదెగుమ్మి జలపాతంలో విశ్రాంత నేవీ ఉద్యోగి మృతి
- ఫొటోల కోసం దిగి ప్రమాదం
- ఇప్పటికి 41 మంది మృతి

కొయ్యూరు : గాదెగుమ్మి జలపాతం.. చాలా ప్రమాదకరమని అందరికీ తెలుసు. బయటివారెవరైనా తెలియకుండా వస్తే.. హెచ్చరించేందుకు అటువైపు ఎవరూ వెళ్లరాదన్న హెచ్చరిక బోర్డు కూడా ఉంది. అయినా ఎవరూ పట్టించుకోరు. సరదా కోసం జలపాతంలోకి దిగిన వారిలో చాలా మంది ప్రాణాలతో తిరిగిరాలేదు. మృతదేహాల కోసం రోజుల తరబడి వెతుకులాడాల్సిన పరిస్థితి. తాజాగా గురువారం గాదెగుమ్మి జలపాతంలో ఫోటోల కోసం దిగిన ఒకరు ప్రాణాలను కోల్పోయారు. పెద్దగా శ్రమించాల్సిన పనిలేకుండా మృతదేహం కూడా వెంటనే బయటకు వచ్చింది. అనేక సందర్భాల్లో రెండు మూడు రోజులైనా మృతదేహం పైకి రాదు.

విశాఖలోని వేపగుంట దరి పురుషోత్తపురానికి చెందిన మంతెన సుబ్బరాజు(41) గురువారం ఫోటోల కోసం జలపాతంలోకి దిగి ప్రాణాలు కోల్పోయాడు. ఇండియన్ నేవీ ఉద్యోగి అయిన సుబ్బరాజు గతేడాదే పదవీ విరమణ పొందారు. నర్సీపట్నంలో తెలిసిన వారి వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అక్కడ నుంచి జలపాతం చూసేందుకు కుటుంబంతో వెళ్లారు. అయితే జలపాతంలో ఫోటోలు తీసుకుంటుండగా అతని కూతురు లాస్య జారిపోబోతే ఆమెను పట్టుకుని పైకి లేపి కాపాడారు. అదే క్రమంలో అతనికి పట్టుదొరకక జలపాతంలోకి జారిపోయారు. వెంటనే అక్కడున్న బంధువులు వచ్చి కేకలు వేశారు. అయితే చుట్టు పక్కల వారు వచ్చినా జలపాతంలోకి దిగే సాహసం చేయలేదు. గల్లంతైన రెండు గంటల తరువాత మృతదేహం బయటకు వచ్చింది. సుబ్బరాజు మృతదేహాన్ని చూసి భార్య శిరీష, కొడుకు కార్తీక్, కూతురు లాస్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాదమని తెలిసీ సాహసం

ఫొటోల పిచ్చిలో పడి ప్రమాదమని తెలిసీ జలపాతంలోకి దిగుతున్నారు. మృతిచెందిన సుబ్బరాజు అతని స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి జలపాతం పైకి వెళ్లి ఫోటోలు తీసుకున్నారు. అలా తీసుకున్న కొద్ది క్షణాలలోనే జారిపడబోతోన్న కూతుర్ని రక్షించి, తాను మరణించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ స్వామినాయుడు, ఎస్ఐ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఇప్పటికి 41 మంది మృతి

ఏ ప్రమాదం నుంచైనా ప్రాణాలతో బయటపడవచ్చు కానీ.. ఈ జలపాతంలో పడిన వారు ఎవరు ప్రాణాలతో బయటపడ్డ దాఖలాల్లేవంటే అతిశయోక్తి కాదు. వారి మృతదేహాలు మాత్రమే బయటకు వస్తున్నాయి. అదృష్టం బాగుంటే వెంటనే.. లేకుంటే.. రెండు మూడు రోజులకుగానీ మృతదేహాలు బయటకురావు. చిన్నపాటి నిర్లక్ష్యంతో తమ కుటుంబాల్లో తీరని వేదన మిగుల్చుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో సుబ్బరాజుతో కలిసి 41 మంది మరణించినట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. అధికారులు చర్యలు చేపట్టి జలపాతం ముందున్న రాళ్లను పగులగొడితే ప్రమాదం జరిగినా ప్రాణాలతో బయటపడే వీలుంటుందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపాలని, మరే కుటుంబాల్లో ఇలాంటి విషాదం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న విజయేంద్ర సరస్వతి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మిని కంచికామకోటి పీఠాధిపతి, జగద్గురు శంకరాచార్య విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. సాయంత్రం 5 గంటలకు విజయేంద్ర సరస్వతి శిష్యులచే అమ్మవారికి ప్రీతికరమైన 'శ్రీ కనకధారాస్తవం' పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, సతీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారాయణ నిర్వహిస్తున్న కార్యక్రమంలో కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం రేపు

అరకులోయ రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 28న వేలం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ గణపతిబాబు తెలిపారు. ఆటో, నాలుగు బైక్‌లు వేలం వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 9440902393, 7981049077 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బొమ్మను చేసి.. ప్రాణం పోసి..

ఔను.. సీవీ రాజు ఏటికొప్పాక బొమ్మలకు నిజంగా ప్రాణమే పోశారు.. ఈ లక్కబొమ్మలకు ఖండాంతర ఖ్యాతి రావడం వెనుక ఆయన మూడున్నర దశాబ్దాల కృషి దాగివుంది. యలమంచిలి మండలంలోని మారమూల గ్రామం ఏటికొప్పాకకు చెందిన చింతలపాటి వెంకటపతిరాజు (సీవీరాజు) తమ తాత నుంచి లక్కబొమ్మల తయారీ కళ వారసత్వంగా వచ్చినా మొదట్లో అంతగా దృష్టి సారించలేదు. క్రమక్రమంగా ఏటికొప్పాక బొమ్మలకు వైభవం తగ్గిపోతూ రావడంతో ఆయన ఈ రంగానికి ఎలాగైనా పూర్వ స్థితి తీసుకురావడానికి 35 ఏళ్ల కిందట నడుం బిగించారు. ఆ ప్రయత్నంలో ఆయన సాధించిన విజయానికే పద్మశ్రీ వరించింది.



రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి అవార్డు అందుకుంటున్న సీవీ రాజు



ఏటికొప్పాకలో రాజు స్థాపించిన హస్తకళా నిలయం

- సీవీ రాజు కృషితో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 'మేటికొప్పాక'
- లక్కబొమ్మలకు సహజ రంగులద్దిన కళాకారుడు
- పద్మశ్రీ వరించడంతో మురిసిపోతున్న హస్తకళారంగం

అనకాపల్లి రూరల్/యలమంచిలి: ఒకపక్క అంకుడు కర్ర కొరత.. మరోపక్క సరైన మార్కెటింగ్ అవకాశాలు లేకపోవడం ఏటికొప్పాక హస్తకళారంగాన్ని కొన్నాళ్లపాటు అవస్థల పాలు చేశాయి. కుటుంబంలో నలుగురు రోజంతా పనిచేసినా ఇల్లు గడవడమే కష్టంగా వుండేది. ఈ సమయంలో చాలామంది వేరే వృత్తులకు మరలిపోయారు. ఈ పరిణామం సీవీ రాజును ఆలోచింపజేసింది. ఇలా జరిగితే తమ గ్రామానికి వున్న గుర్తింపు, ఖ్యాతి పోతుందని భావించి, పడిపోతున్న హస్తకళలకు ప్రాణం పోసేందుకు శ్రీకారం చుట్టారు. లక్కబొమ్మల తయారీని కొత్త పుంతలు తొక్కించేందుకు 1999లో హస్తకళా నిలయాన్ని ప్రారంభించారు.

సహజసిద్ధ రంగుల తయారీలో శిక్షణ

ఢిల్లీ వెళ్లి అధ్యయనం చేసిన సీవీ రాజు లక్కబొమ్మల తయారీలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టారు. మార్కెటింగ్ టెక్నిక్‌తో ముందు విదేశాల నుంచి ఆర్డర్లు వచ్చేలా కృషి చేశారు. అయితే రసాయనాలు కలిపిన రంగులు వినియోగిస్తే విదేశాల్లో మనుగడ ఉండదని గ్రహించిన రాజు సహజసిద్ధ రంగులనే వినియోగించాలని సహచరులకు సూచించారు. హస్తకళా నిలయంలో సహజ రంగుల తయారీలో శిక్షణ ఏర్పాటు చేశారు. ఇది ఎంతో సత్ఫలితాలను ఇచ్చింది. పసుపు, కరక్కాయ, ఇండిగో పిక్కలు, జాఫ్రా వంటి వస్తువులతో సహజసిద్ధ రంగులను తయారు చేసి బొమ్మలకు అద్దడంతో విదేశాల నుంచి డిమాండ్ పెరిగింది. ఏటికొప్పాక బొమ్మలను పూర్వ వైభవం వచ్చింది.

ఎందరికో స్ఫూర్తి


ఎంతోమంది హస్తకళాకారులను, యువకులను ప్రోత్సహించి, మళ్లీ లక్కబొమ్మల తయారీపై మక్కువ కలిగేలా చేశారు సీవీ రాజు. ఆయన ప్రేరణతోనే శ్రీశైలపు చిన్నయాచారి, శరత్ వంటి అనేకమంది కళాకారులు తయారు చేసిన లక్కబొమ్మలకు జాతీయ స్థాయిలో కూడా ఎన్నో పురస్కారాలు లభించాయి. ఏటికొప్పాక బొమ్మలను పోలినట్లు డూప్లికేట్ లక్కబొమ్మలను చైనా మార్కెట్లోకి దించినప్పటికీ, ఆ పోటీని ఇక్కడి హస్తకళాకారులు తట్టుకుని నిలబడ్డారు. క్రమంగా చైనా బొమ్మల మార్కెట్ పడిపోగా ఏటికొప్పాక కళాకారులు తయారు చేసిన కళాఖండాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అంతరించిపోతున్న అద్భుత కళకు అన్నీ తానై విశేష సేవలందించిన సీవీరాజు కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. గతంలో మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సీవీ రాజును ప్రశంసించిన విషయం తెలిసిందే.

సీవీ రాజును వరించిన పురస్కారాలు

- పద్మావతి అసోసియేట్స్ పేరుతో నడుపుతున్న హస్తకళా నిలయానికి 2002లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ అవార్డు
- క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి సత్కారం
- తెలంగాణ క్రాఫ్ట్స్ కౌన్సిల్ నుంచి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు
- 2006లో సౌత్ ఆసియా నుంచి సీల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు



భవిష్యత్తు తరాలకు ఆదర్శం కావాలి



ఏటికొప్పాక కళ కనుమరుగు కాకూడదు. ప్రపంచ దేశాల్లో మా లక్కబొమ్మలకు ప్రాముఖ్యత ఉంది. ఇది నా గొప్పతనం కాదు.. కళకు ఉన్న గొప్పతనం. 2020 ఆగస్టులో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మన్ కీ బాత్‌లో నేను మాట్లాడాను. ఈ కళకు తగిన సాంకేతికతను అందించి.. భవిష్యత్తు తరాలవారికి కూడా ఏటికొప్పాక బొమ్మల తయారీ ఉపాధి చూపాలని ఆయన ఆకాంక్షించారు. ఏటికొప్పాక కళపై, ప్రకృతిసిద్ధ రంగులతో ఇక్కడ తయారు చేసే బొమ్మలపై ప్రధానికి అవగాహన ఉంది. తప్పకుండా ఏటికొప్పాకకు మంచి రోజులు రానున్నాయి. మా కళను గుర్తించినందుకు ధన్యవాదాలు.

-సీవీ రాజు, ఏటికొప్పాక

అభిమానులతో అల్లు అర్జున్



కొమ్మాది: విశాఖ నోవాటెల్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులతో కాసేపు సందడి చేశారు. పోర్టులో పుష్ప-2 (ది రూల్) సినిమా షూటింగ్ గత వారం రోజులుగా జరుగుతున్న సంగతి తెలిసిందే. గురువారం మధ్యాహ్నం కొందరు అభిమానులను నోవాటెల్‌లో కలుసుకున్నారు. తమ అభిమాన నటుడితో ఫొటోలు తీసుకుని సంబరపడ్డారు.

తాజుద్దీన్‌బాబా జయంతి ఉత్సవాలు ప్రారంభం



తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలో గల ఆశ్రమంలో తాజుద్దీన్‌బాబా 162వ జయంతి వేడుకలు గురువారం సాయంత్రం ప్రారంభం అయ్యాయి. ఆశ్రమ వ్యవస్థాపకుడు రెడ్డిబాబా పతాకావిష్కరణతో ఈ వేడుకలు ప్రారంభమైనట్టు ప్రకటించారు. శుక్రవారం జయంతి సందర్భంగా ఆశ్రమంలో బాబా దర్బారుపై వేలాది మంది భక్తులు పువ్వులు, చందనం, చాదర్, అత్తరు వంటి పూజాద్రవ్యాలు ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. జయంతి సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు ఆశ్రమంలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించినట్టు ఆశ్రమ ట్రస్టీ డి.రాజు కుమందన్ తెలిపారు.